ఆదివారం ఆంధ్రభూమి డెయిలీ, 1984-1985

"చదువుకునే రోజుల్లో మా యింటి పక్క కవిగారు పారిపోకుండా
నా చేతులు గట్టిగా పట్టుకుని నాకు కవితలు వినిపిస్తూండేవారు.
ఆయన్ను తోసేసే బలం సంపాదించాలనే మా అమ్మ పెట్టినవన్నీ తినేవాణ్ణి.
అలా సంపాదించిన బలం ఎన్నింటికో పనికొచ్చింది-" అన్నాడు
చక్రపురం గూండా నుంచి విద్యాశాఖామంత్రి స్థాయికెదిగిన పెంచలయ్య.

# కవులు పరుగెడుతున్నారు

అదృష్టం ఎవర్నెప్పుడు ఎలా వరిస్తుందో చెప్పడం కష్టం.

ఉన్నట్లుండి పెంచలయ్య మంత్రి అయ్యాడు.

పెంచలయ్య బొత్తిగా ఊరూపేరూలేని వాడైతే ఇబ్బంది ఉండేది కాదు. అతణ్ణి చక్రపురం గూండా అని అందరూ చెప్పుకునేవారు. చక్రపురం అతడి ఊరు.

పెంచలయ్య విద్యార్థిగా చాలాసార్లు సమ్మెలు చేయించాడు. అందుకని అతడికి విద్యాశాఖామంత్రి పదవి వచ్చింది. ఆ పదవి ఎలా నిర్వహించాలా అని పెంచలయ్య బెంగెట్టుకోలేదు. అందుకు సెక్రటరీ ఉండనే ఉన్నాడు. అతడికి బాగా తెలిసిన నరేష్ అనే ఓ ఎమ్మే లిటరేచర్ కుర్రాణ్ణి పెంచలయ్య సెక్రటరీగా చేసుకున్నాడు.

నరేష్‌కు చదువు తప్ప పాలిటిక్సు తెలియవు. పెంచలయ్యకు పాలిటిక్సు తప్ప ఇంకేమీ తెలియవు. తమజోడీ చాలా గొప్పగా హిట్టవుతుందని పెంచలయ్య నమ్మాడు.

చక్రపురం గూండాగా ఊరూ పేరూ ఉన్న పెంచలయ్య విద్యాశాఖామాత్యులు కావడం రాష్ట్రంలో పెద్ద సంచలనాన్ని కలిగించింది. చాలా పత్రికలీ విషయాన్ని తీవ్రంగా ఖండించాయి. కొన్ని పత్రికలు పెంచలయ్యకు అక్షరజ్ఞానమే లేదని ఆరోపించాయి.

"సార్ మీకు అక్షరజ్ఞానం లేదనడం మాత్రం అన్యాయం" అన్నాడు నరేష్ ఆ ఆరోపణలు చూసి.

"మిగతావి మాత్రం అన్యాయం కాదా! వాళ్ళంతా నన్ను గూండా అంటున్నారు. లంచగొండినంటున్నారు. సంస్కార విహీనుణ్ణంటున్నారు" అన్నాడు పెంచలయ్య.

"నా అభిప్రాయం అది కాదు సార్!' మిగతావి కాదని ఋజువు చేసుకోవడంకష్టం. అక్షరజ్ఞానం మీకుందని ఋజువు చేయడం సులభం. అది ఋజువు చేస్తే ఆ పత్రికల వాళ్ళు రాసింది అబద్ధమేనని ఋజువౌతుంది కదా! అప్పుడు మనం ఇలాగే మిగతా

విశేషాలన్నీ అబద్ధమని చెప్పొచ్చు.

''అయితే ఏం చేయమంటావ్? ప్రజల ముందుకు వెళ్ళి డిక్టేషన్ తీసుకోమంటావా?" అన్నాడు పెంచలయ్య చిరాగ్గా.

"అబ్బే అలాగెందుకండి! ఇంకా సులభమైన దొకటుంది. మీరో చోటకు వెళ్ళి కాగితం చూసి ఉపన్యాసం చదవండి" అన్నాడు నరేష్.

"ఉపాయం బాగానే ఉంది కానీ కాగితం చూసి స్పీడుగా చదువలేనయ్యా, తడువుకోవాల్సుంటుంది" అని "పబ్లిక్ పరీక్షలొచ్చేదాకా నేనెప్పుడూ చదవకుండానే ప్యాసైపోయేవాణ్ణి. గూండా గూండా అని నన్నాడిపోసుకోవడమేకానీ ఈ మేష్టర్లెప్పుడూ నా చేత చదివించాలని చూడలేదు" అన్నాడు పెంచలయ్య.

"దానికేముందండీ - ఉపన్యాసాన్ని ముందు కంఠతాపడితే బాగుంటుంది. ఆ తర్వాత కాగితం చూసి గడగడా చదివేయడమే!" అన్నాడు నరేష్.

"అలా నావల్లకాదయ్యా బాబూ! కంఠతా పట్టేనంటే కాగితం చూసి చదవలేను. గడగడా అప్పచెప్పేయడమే" అన్నాడు పెంచలయ్య.

"అలా చేసినా ఫర్వాలేదు. కాగితం చేత్తో పట్టుకోండి. దానికేసే చూస్తూ చదవండి. మీరు అప్పజెప్పేసినా ఫరవాలేదు. ఎప్పుడు కాగితం తిప్పాలో నేను చూసుకుంటాను" అన్నాడు నరేష్.

"కాగితం తిప్పడమేమిటి?" అన్నాడు పెంచలయ్య.

"మరి మీరు రెండో పేజీలోని విషయానికొచ్చేశారనుకోండి. అప్పుడింకా మొదటి పేజీలో చూస్తుంటే బాగుండదు కదా!" అన్నాడు నరేష్. "నేను మీ వెనుకనే ఉండి అవసరమైనప్పుడల్లా పేజీలు తిప్పుతూంటాను".

నీ తెలివి తెల్లారినట్లే ఉంది. మన కాగితంలో ఏమున్నదీ అవతలివాడికెలా తెలుస్తుందీ" అన్నాడు పెంచలయ్య.

"భలేవారే సార్! ముందుగానే మీ ఉపన్యాసాన్ని కాపీలు తీయించి సభలోని వారందరికీ ఇస్తాం. వాళ్ళవి చూస్తుంటారు. మీరు చదువుతుంటారు. మీ అక్షరజ్ఞానం గురించి అప్పుడందరికీ రూఢి అవుతుంది" అన్నాడు నరేష్.

"అయితే కాగితం మీదున్నది నేను నిజంగానే కంఠతాపట్టాలన్నమాట" అన్నాడు పెంచలయ్య దిగులుగా.

"తప్పదు సార్! మీ మీద వచ్చిన అపవాదును తొలగించుకునేందుకు మీరా మాత్రం శ్రమపడక తప్పదు" అన్నాడు నరేష్.

"సరే అయితే త్వరగా ఓ ఉపన్యాసం తయారుచేయి" అన్నాడు పెంచలయ్య.

"ఉపన్యాసానికి సందర్భమేమిటో చెప్పండి సార్!" అన్నాడు నరేష్.

పెంచలయ్య దీనికి మండిపడి "సమయం సందర్భం చూసుకుని మాట్లాడాలంటే నేను రాజకీయాలు వదిలిపెట్టి ఏ బడిపంతులుగానో స్థిరపడాలి. ఏం సెక్రటరీవి దొరికావయ్యా బాబూ!" అన్నాడు.

నరేష్ వినయంగా "ముందుగా రాసుకుని చదివేది కదా దీనికి సందర్భం ఉండక తప్పదండి" అన్నాడు.

పెంచలయ్య, నరేష్ కాసేపు ఈ విషయమై చర్చించారు.

ఉన్నట్లుండి "సార్ బ్రహ్మాండమైన అయిడియా! తమరు కవి సమ్మేళనం ఒకటి ఏర్పాటు చేయండి. అక్కడ కవితల పోటీ జరుపుదాం. దానికి మీరే న్యాయాధిపతి. ఈ విధంగా ఒకే దెబ్బకు రెండు పిట్టలు. మీకు అక్షరజ్ఞానమున్నదని ఋజువు కావడమే కాదు. సాహితీ పోషకులుగా కూడా మీరు పేరు తెచ్చుకుంటారు" అన్నాడు నరేష్ ఉత్సాహంగా.

పెంచలయ్య నరేష్ భుజం తట్టి మెచ్చుకుని "వెరీగుడ్! నా సెక్రటరీ అంటే అలాగుండాలి" అన్నాడు. అంతలోనే అతడికి మళ్ళీ అనుమానం వచ్చింది, "కవిత్వం గురించి నాకు బొత్తిగా తెలియదు. చదువుకునే రోజుల్లో మా ఇంటి పక్క ఓ కవిగారుండేవాడు. ఆయన అస్తమానం నన్ను పిలిచి కవితలు వినిపిస్తూండేవాడు. ఆయన్ను తోసేసే బలం సంపాదించడం కోసమే మా అమ్మ పెట్టేవన్నీ తినేవాణ్ణి. అలా సంపాదించిన బలం ఎన్నింటికో పనికొచ్చింది. కానీ కవితలంటే నాకు భయం. అవి నాకు అర్థం కావు. అలాంటప్పుడు నేను పోటీల్లో ఉత్తమ కవిత్వాన్నెలాగెన్నుకోగలను?"

"మీరు విద్యాశాఖామాత్యులు. మీకు నచ్చిందీ మీరు మెచ్చిందీ ఉత్తమ కవిత్వం అయి తీరుతుంది" అన్నాడు నరేష్.

వెంటనే కవి సమ్మేళనం గురించి ప్రకటన వెళ్ళింది. ప్రకటన చూసి ఎందరో నరేష్ కుత్తరాలు రాశారు. అతడూహించినట్లు గానే వాళ్ళలో గొప్పవాళ్ళెవ్వరూ లేరు. అందులోంచి వందమందిని ఎన్నిక చేశాడతడు.

ఈలోగా పెంచలయ్యకు ఉపన్యాసం తయారయింది.

పెంచలయ్య ఉపన్యాసం కాగితం చూసినా గడగడా మంచినీళ్ళ ప్రవాహంలా సాగిపోయింది. అతడి ఉపన్యాసం పూర్తి కాగానే ఓ కవివర్యుడు తటాలున స్టేజి ఎక్కి "ఈ ఉపన్యాసం వింటూంటే నా మనసుప్పొంగుతున్నది. కవులకు మళ్ళీ మంచిరోజులు వచ్చాయనిపిస్తున్నది. శ్రీ పెంచలయ్యగారు విద్యాశాఖామాత్యులు కావడం మన అదృష్టం. వారు చెప్పిన ప్రకారం వారి శ్రీమతి గీతగారు కూడా గొప్ప సాహిత్యాభిమాని. శ్రీమతి గీత కూడా ఈ సభను అలంకరించి వుంటే ఎంతో బాగుండేది. ముమ్ముందు ఇంకా ఇలా చాలాచాలా కవి సమ్మేళనాలు జరగాలి. ఆ సభలకు పెంచలయ్యగారు తన శ్రీమతి గీతను కూడా తీసుకుని వస్తారని ఆశిస్తాను" అన్నాడు. వెంటనే చప్పట్లు మార్మోగి పోయాయి. కవి వర్యుడు దిగి తన స్థానంలో కూర్చున్నారు.

ఉపన్యాసం ముగించిన కవిని నరేష్ పక్కకు పిలిచి "మీకు మంత్రిగారి భార్య పేరు ఎలా తెలిసింది?" అన్నాడు.

"ఆయనే తమ ఉపన్యాసంలో చెప్పారుగా" అన్నాడు కవివర్యుడు.

నరేష్ గతుక్కుమన్నాడు. పొరపాటెలా జరిగిందో అతడికర్థమైంది.

ఉపన్యాసం రాసిచ్చినప్పుడు నరేష్ మంత్రిగారి భార్య ప్రసక్తి తీసుకుని వచ్చాడు. ఉపన్యాసాల్లో మంత్రులు తమ భార్యలకు లేని గుణాలు ఆపాదించి పొగుడుతూండాలిట.

ఇలాగని అతడు మంత్రిగారి భార్య ప్రస్తావన తీసుకుని వచ్చి ఆవిడపేరు తెలియక ఆ స్థానంలో చిన్న డాష్ ఉంచాడు. అక్కడ పెంచలయ్య తన భార్య పేరు చెప్పాల్సి ఉంది. అయితే పెంచలయ్య పేరు రాసుకోవడం మర్చిపోయి దాన్ని యధాతథంగా నరేష్ ముందు చదివి ప్రాక్టీసు చేశాడు. డాష్ అన్నచోట ఆయన గీత అని చదివేస్తే అదే పెంచలయ్య భార్య పేరని నరేష్ అనుకున్నాడు.

వరుసగా ఒక్కొక్కరే ఉపన్యాసాలిస్తూ పెంచలయ్య భార్య గీతను పొగిడేస్తూంటే కంగారు పడిన పెంచలయ్యకు నరేష్‌ని సంప్రదించేక అసలు విషయ.

తెలిసి "అయితే ఇప్పుడేం చేయాలి? నా భార్య పేరు సూరమ్మ. అన్నాడు పెంచలయ్య పేపరు వాళ్ళు కూడా నా భార్యపేరు గీత అని పేపర్లలో వేసేస్తారేమో!" అన్నాడు.

"వెయ్యనీండి సార్. సూరమ్మపేరు కంటే గీత అన్న పేరే బాగుంది. ఇక నుంచి మీరావిణ్ణి ఆ పేరుతోనే పిలవండి. గీత అన్నది అమ్మగారి కలం పేరు. సాహిత్యంలో కలంపేరు కొందరికి ఆచారం" అన్నాడు నరేష్.

"సరేలే అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందీ సభ త్వరగా ముగిసే ఏర్పాటు చూడు" అన్నాడు పెంచలయ్య.

కవివర్యులు ఒకరి తర్వాత ఒకరు గీత గురించి మాట్లాడేస్తూండగా నరేష్ మధ్యలో కలుగచేసుకుని "మంత్రిగారికింకా అత్యవసరమైన పనులెన్నో ఉన్నవి. ఇంతవరకూ కొందరు కవితలు చదివారు. అందరి కవితలూ వినడానికీ, చదవడానికీ సమయం చాలదు. అందువలన త్వరగా మీ శక్తి చూపించుకునే మార్గం మీరే ఏదైనా చెప్పండి" అన్నాడు.

మాట్లాడిన కవులు ముఖముఖాలు చూసుకున్నారు. వారిలో ఒకడులేచి మేము ఇంకా మా కవితలు చదవలేదు." అని ఏదో చెప్పబోయాడు.

నరేష్ వెంటనే "అయితే వేదికపై విలువైన కాలం మరికొంత వృథా అయింది. కాబట్టి వెంటనే మీ శక్తి చూపించుకునే మార్గం అన్వేషించండి" అన్నాడు.

ఉన్నట్లుండి పెంచలయ్య లేచి "తక్కువ సమయంలో మీలో ఎక్కువ శక్తిగలవారెవ్వరో నిర్ణయించడానికో సులభమైన ఉపాయముంది. మీలో అధికశక్తి మంతుడికి అయిదువేల రూపాయల నగదు బహుమతి. కవితలను అచ్చువేసుకునేందుకు ప్రభుత్వం వేరే గ్రాంటు ఇస్తుంది. మీరిక్కడ సుమారు వందమంది ఉన్నారు. మీరందరూ ఇప్పుడు ఈ ఆడిటోరియం బయటకువెళ్ళి దీని చుట్టూ మూడుసార్లు పరుగెత్తి ఎవరు ముందుగా వస్తారో వారిది ఉత్తమ కవిత్వం" అని కూర్చున్నాడు.

అక్కడున్న కవివర్యులు నివ్వెరబోయారు. శక్తిని పరీక్షించడమంటే కవితాశక్తిని అనుకున్నారు. కానీ ఇలా జరుగుతుందనుకోలేదు.

ఓ ఇద్దరు ముగ్గురు కవులు లేచి నిలబడి "ఇది మాకు అవమానం. మా శక్తిని తెలుసుకోవాలంటే మా కవితలు విని మా గొప్పతనాన్ని నిర్ణయించండి" అన్నారు.

నరేష్ మైకువద్దకు వచ్చి "ఇందులో అవమానమేమీ లేదు. ఈ రోజుల్లో కవితలంటే జనం శరవేగంతో పారిపోతున్నారు. ఎవరికైనా కవిత వినిపించాలంటే కవికి పరుగులో శ్రోతను మించిన వేగం ఉండాలి. అందుకే ఈ పరుగు పందెం. మామూలు పరుగు పందేనికీ దీనికీ తేడా ఉన్నది. పందెంలో గెలిచినవాడు కవి కాబట్టి బహుమతి అయిదువేల రూపాయలున్నది" అన్నాడు.

కొందరు పోటీలో పాల్గొనకూడదనుకున్నారు. కానీ చాలామందిని బహుమతి మొత్తం ఆకర్షించింది. కవిత్వమెలాగూ కూడూ గుడ్డా పెట్టడం లేదు. కనీసం పరుగుతోనైనా అయిదువేలు వస్తూంటే ఎందుకు వదులుకోవాలి!

పరుగు పందెం జరిగింది. కవులు పరుగెత్తారు. ముమ్మారు ఆడిటోరియానికి ప్రదక్షిణ చేశారు.

ఆ విధంగా గోవిందానికి బహుమతి వచ్చింది.

ఈ వార్త పత్రికలో వచ్చింది. సాహిత్యలోకంలో ఇదో గొప్ప సంచలనాన్ని కలిగించింది.

గోవిందాన్ని అనేకమంది ఇంటర్వ్యూ చేసి అతడి అభిప్రాయాన్నడిగారు.

తనకు బహుమతి వచ్చినందుకు సంతోషాన్నే అతడు వ్యక్తం చేశాడు.

"సాహితీ సరస్వతికిది అవమానం కాదా!" అని కొందరు ప్రశ్నించారు.

"మెజారిటీ ఎన్నుకున్న పార్టీలోంచి ప్రజాభిమానం చూరగొన్న విద్యామంత్రి నా కవితాశక్తిని నిర్ణయించడానికి కొత్త పద్ధతిని కనిపెట్టి సన్మానిస్తే అందులో సాహితీ సరస్వతికి అవమానమేమున్నది? అవమానమంటూ ఉంటే అది ప్రజలది?" అన్నాడతడు.

ఈ విషయంలో పత్రికాధినేతలు పెంచలయ్యనూ వదల్లేదు.

వారికి సరైన సమాధానాలివ్వలేక కొంతకాలం అతడు వారిని తప్పించుకుని తిరిగాడు. అయితే ఈ లోగా ఇంకో తమాషా జరిగింది.

తాము తెలుగులో కవిత్వం చెప్పడం ప్రారంభిస్తున్నట్లూ తమను కవిసమ్మేళనానికి ఆహ్వానించవలసిందనీ కేరళ నుంచి పి.టి. ఉష, వాలసమ్మ, వందనరావు అనే అమ్మాయిలుత్తరాలు రాశారు. మరెవరైనా వారి పేర్లతో ఉత్తరాలు రాశారేమోనని నరేష్ అనుమానించాడు కానీ దేశదేశాలనుంచి ఎందరో అథ్లెట్సు అలాంటి ఉత్తరాలే రాశారు. అవి నిజంగా విదేశాల నుంచే వచ్చినట్లు స్టాంపులను బట్టి అర్థమయింది నరేష్‌కి.

నరేష్ ఈ వార్తకు బాగా ప్రచారమిచ్చాడు. ఎన్నో భాషల వారినీ, ఎన్నో దేశాల వారినీ తెలుగు కవిత్వంపై దృష్టి మరల్చే విధంగా కవితా పరిశీలనలో కొత్త వరవడి పెట్టిన ఘనుడిగా పెంచలయ్యకు ప్రాచుర్యం లభించింది.

ఫలితంగా ఆనాటి నుంచీ శ్రోతలకు బదులు కవులు పరుగెడుతున్నారు!

✦ ✦ ✦